కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము అనే జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు సాగిస్తున్న పోరాటాల్ని బలపరుద్దాం!

షేర్ మార్కెట్‌లలోకి పెన్షన్ నిధుల్ని మదుపు చేయిస్తున్న ప్రపంచబ్యాంకు కుట్రల్ని తిప్పికొడదాం!

కేంద్ర, రాష్ట్ర పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం!

బ్రిటిష్ వలస పాలన కాలంలోనే పెన్షన్ విధానం రూపుదిద్దుకొంది. వయసులో వున్నపుడు దేశంకోసం, సమాజంకోసం పనిచేసిన వాళ్ళకు– వయసు ఉడిగి, పనిచేసే శక్తి దెబ్బతిన్నపుడు వారిని బ్రతికించే బాధ్యత సమాజమే చేపట్టాలన్న భావన నుండి బయలుదేరిన సామాజిక భద్రతా పథకమిది. సైన్యంలో పనిచేసిన వారితో మొదలై తర్వాత ప్రభుత్వరంగంలోని కార్మికులకు, ఉద్యోగులకు కూడ దీనిని వర్తింప చేశారు. తర్వాత క్రమంలో ప్రభుత్వరంగ పరిశ్రమలు, కార్పొరేషన్లు, బ్యాంకులు తదితర రంగాలవారు కూడా పోరాడి ఈ హక్కును సాధించుకోగలిగారు. ఉద్యోగంలో వున్నపుడుగాని, రిటైరయిన తర్వాతగానీ ఉద్యోగి చనిపోతే ఆ కుటుంబానికి కూడ ఈ పెన్షను వర్తింపజేశారు.

ఇక ప్రైవేటు రంగంలోని పరిశ్రమలు, సంస్థల విషయానికొస్తే ఉద్యోగుల భవిష్య నిధి పథకం (ఇ.పి.ఎఫ్)ను 1952లో, ఉద్యోగుల పెన్షన్ పథకం (ఇ.పి.ఎస్)ను 1995లో ప్రవేశపెట్టారు. వీటి ప్రకారం ప్రైవేటు సంస్థలో పనిచేసే ఉద్యోగి వేతనంనుండి 12 శాతాన్ని కత్తిరించి, అంతేమొత్తాన్ని యాజమాన్యం కలిపి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమ చేస్తారు. దీని నిర్వహణ అంతా భవిష్యనిధి సంస్థ చూస్తోంది.

దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలయ్యే క్రమంలో ప్రపంచబ్యాంకు కన్ను ఈ పథకాలపై పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకిస్తున్న వేతనాలతో పోల్చినపుడు పెన్షన్ పొందే వారి సంఖ్య, మొత్తాలూ పెరుగుతున్నాయనీ, కావున కత్తిరించమన్న ఒత్తిడి మొదలెట్టింది. ఫలితంగా 1991 తర్వాత ఈ విషయమై అనేక కమీషన్లు వేసి రిపోర్టు తీసుకున్నారు. ఈ రిపోర్టులలోని సారాన్ని కూడ పక్కనపెట్టి కఠినమైన షరతులతో కేంద్రప్రభుత్వం జాతీయ పెన్షన్ పథకం (ఎన్.పి.ఎస్) అన్న పథకాన్ని రూపొందించి 2004 జనవరి తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరికీ వర్తింపచేశారు. ఇదే బాటలో మన రాష్ట్రప్రభుత్వం 2004 సెప్టెంబరు 1 తర్వాత చేరిన ఉద్యోగులందరికీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం(సి.పి.ఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. **ఇందుకొరకు ప్రవేశపెట్టిన పిఎఫ్ఆర్‌డిఏ బిల్లు 2013 ఆగస్టులో పార్లమెంటు ఆమోదం పొంది చట్టంగా మారింది. కానీ ఈ చట్టాన్ని 2004 జనవరిలోనే అమలులోకి తెచ్చారు. కాంగ్రెసు, బిజెపి, టిఆర్ఎస్, తెలుగుదేశం పాలకులందరిదీ ఈ విషయంలో ఏకాభిప్రాయమే.**

దీనిప్రకారం ఉద్యోగుల, కార్మికుల మూలవేతనం (బేసిక్)లోను, కరువుభత్యం(డి.ఎ)లోను 10 శాతం మొత్తాన్ని కత్తిరిస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కలుపుతుంది. గతంలో ప్రభుత్వ సంస్థలే ఈ నిధుల్ని సేకరించాయి. కొత్తచట్టం ప్రకారం 6 ప్రైవేటు సంస్థలకు వీటిని సేకరించే అవకాశం ఇచ్చారు. ఇందుకోసం వీటికి వచ్చే లాభాల్లో 2 శాతం ఫీజు కూడా చెల్లిస్తారు.

గతంలో రాష్ట్రప్రభుత్వాల అవసరాలకోసం పి.ఎఫ్ మొత్తాన్ని అప్పుగా ఇచ్చి, వాటిని తిరిగి రాబట్టి వడ్డీని ఉద్యోగులకు చెల్లించేవారు. ఇపుడీ కొత్తచట్టం ప్రకారం ప్రైవేటు బడాకార్పొరేట్ సంస్థల షేర్లలో 50 శాతం మొత్తాన్ని మదుపుచేయాలన్నారు. 30 శాతాన్ని ప్రభుత్వరంగ సంస్థల బాండ్లలోను, 20 శాతాన్ని ప్రభుత్వ సెక్యూరిటీలలోను పెట్టాలన్నారు.

ఇ.పి.ఎఫ్; ఇ.పి.ఎస్.లలో పోగుపడిన ప్రైవేటు రంగ ఉద్యోగుల పెట్టుబడుల్నికూడ కొత్తగా తెచ్చిన ఎన్.పి.ఎస్. లోకే జమ చేశారు. రిటైరయ్యేలోపు ఆ పెన్షను మొత్తాన్ని వెనక్కి తీసుకొనే అవకాశం కూడ కత్తిరించారు. దానిపై మహిళా కార్మికులు అనకాపల్లి లోను, హోసూరులోను తిరుగుబాట్లు చేశాక మన కేంద్ర కార్మిక మంత్రి దత్తాత్రేయ ఆ నిబంధనను సవరిస్తామన్నారు.

2016 నాటి లెక్కల ప్రకారమే ఎన్.పి.ఎస్‌లోకి (ఇ.పి.ఎఫ్, ఇ.పి.ఎస్‌లు కలిపి) పోగుపడిన మొత్తం రూ.10 లక్షలకోట్లు పైగా వుంది. షేరు మార్కెట్‌లోకి పంపే ఈ పెట్టుబడులకు ప్రభుత్వం ఏమీ పూచీ వహించదు. ఆ కార్పొరేటు కంపెనీలు నష్టాలు చూపిస్తే ఉద్యోగులకు వడ్డీలు కాదు కదా అసలు కూడ ప్రమాదంలో పడుతుంది. విదేశాల్లోని ఉద్యోగులకు ఇప్పటికే ఇలాంటి చేదు అనుభవాలు ఎదురయ్యాయి.

అంటే ఉద్యోగులు పెన్షన్ స్కీంలో మదుపు చేసుకునే తమ స్వంత మొత్తాలుకూడ గాలిలో దీపంలా తయారయ్యేలా మన పాలకులు ఈ పథకాన్ని రూపొందించారు.

ఎం.ఎల్.ఎ.లకు, ఎం.పీ.లకు జీతాలు, పెన్షన్లూ రెట్టింపు చేశారు. కార్లలోన్లు, ప్రయాణభత్యాలు, ఆఫీసు ఖర్చులు పేరిట భారీమొత్తాలు చెల్లిస్తున్నారు. దీనికి మాత్రం బడ్జెట్ నిధులు కొరత అడ్డంరాదు. బడుగు ఉద్యోగుల పెన్షన్ల విషయం వచ్చేసరికి పాలకులు నిధుల కొరత అన్న సాకు సృష్టిస్తున్నారు.

ప్రపంచబ్యాంకు ఇక్కడితోనే ఆగిపోలేదు. ప్రస్తుతం పెన్షన్ పథకాల పరిధిలోకి వస్తున్న వారు 10 శాతం మాత్రమేననీ, 90శాతం వీటికి బయటే వున్నారంటూ వారిని కూడ ఇందులో చేర్చమంటోంది. అందుకోసమే ఆటో కార్మికులపై కూడ ఇటీవలే మన రాష్ట్ర ప్రభుత్వం భారం వేసింది. ఇపుడు గ్రామీణ ఉపాధి కూలీలనుండి కూడ పెన్షన్ నిధులు సేకరించ మంటోంది. ఎవరైనా ఈ పెన్షన్ స్కీముల్లో చేరవచ్చంటూ ప్రకటనలు చేస్తున్నారు. ఈ విధంగా శ్రమజీవుల కష్టార్జితాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల షేర్ మార్కెట్‌లలోకి నిధులు సమీకరించేందుకు ప్రపంచబ్యాంకు పథకం వేయగా, మన దళారీ పాలకులు వారికి వంతపాడుతూ కార్మికులకు, ఉద్యోగులకు ద్రోహం తలపెట్టారు.

అందుకే ఉద్యోగులు, కార్మికులు ఈ విధానాన్ని తిప్పికొట్టాలి. ఇటీవల మన రాష్ట్రంలో చేసిన ఆందోళన ఫలితంగా సి.పి.ఎస్. ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షను పథకాల్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులిచ్చి, సి.పి.ఎస్‌లో పెట్టిన సొమ్మును ప్రభుత్వానికి ధారాదత్తం చేయాలంటూ మెలికపెట్టారు. ఫ్యామిలీ పెన్షనులాగే సర్వీసు పెన్షన్‌కు కూడా ప్రభుత్వమే బాధ్యత వహించాలని మనం డిమాండ్ చేయాలి.

సి.పి.ఎస్. అని పేర్కొనే ఎన్.పి.ఎస్‌ను పూర్తిగా రద్దుచేసి పాత పెన్షను విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌కోసం సెప్టెంబరు 1న జరుగుతున్న మిలియన్ మార్చి ఉద్యమానికి ఏఐఎఫ్‌టియు(న్యూ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది.

షేర్ మార్కెట్‌లోకి పి.ఎఫ్ నిధుల్ని బదలాయించే విధానాన్ని రద్దుచేయాలనీ–ఉద్యోగులకేగాక సంఘటిత, అసంఘటిత కార్మికులతోపాటు వ్యవసాయ కూలీలకు, కరువు పీడిత రైతులకు పెన్షన్ ఇవ్వడాన్ని ప్రభుత్వం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని డిమాండ్ చేద్దాం.

- ఏఐఎఫ్‌టియు(న్యూ)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యవర్గం

oooo